సాక్షి
వరంగల్
సోమవారం । 14 । అక్టోబర్ । 2024



వరంగల్ రంగలీల మైదానంలో దసరా వేడుకలకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

కాశోజీ సెంటర్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రజావాణిలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

కారులో మంటలు



వర్ధన్నపేట: నిలిపి ఉన్న కారులో ఒక్కసారిగా మంటలు వ్యాపించిన ఘటన వర్ధన్నపేటలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై ఓ కారును నిలిపి ఉంచారు. ఇంతలో బానెట్ నుంచి పొగలు రావడంతో వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను ఆర్పి ప్రమాదాన్ని నివారించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు రాజు ఎంపిక



నల్లబెల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కర్రగుర్రపు రాజు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వసంత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గద్వాల జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ అండర్–14 పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా తరఫున ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి రాజును పాఠశాల హెచ్‌ఎం వసంతతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు కోడెపాక శంకరయ్య, ఉపాధ్యాయులు పద్మజ, కుమారస్వామి, అన్నాదేవి, శ్రీధర్ బాబు, సంతోష్ కుమార్, బుచ్చన్న, శోభారాణి, కొమురయ్య, హేము, జ్యోతి, వసీం సుల్తానా అభినందించారు.

వర్ధన్నపేట, ఇల్లందలో చోరీ



వర్ధన్నపేట: మండలంలోని ఇల్లంద శివారు ఆకేరు వాగు ఒడ్డున ఉన్న శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తాళాలు పగులగొట్టి దొంగలు హుండీ ఎత్తుకెళ్లారు. సొమ్మును కాజేసి హుండీని దూరంలో పడవేశారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఇద్దరు వ్యక్తులు లోపలకు వచ్చినట్లు సీసీ కెమెరాల ఫుటేజీలో కనిపించింది. అదేవిధంగా వర్ధన్నపేట ఫిరంగిగడ్డ ప్రాంతంలోని టీ దుకాణంలో దొంగలు గ్యాస్ సిలిండర్, పొయ్యి, కూల్ డ్రింక్స్ దోచుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలాలను పరిశీలించారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల చిచ్చు!



ధ్వంసమైన ఫ్లెక్సీ



ధర్మారంలో ఆందోళన చేస్తున్న కొండా వర్గీయులు

- ఎమ్మెల్యే రేవూరి అనుచరుడిపై కొండా వర్గీయుల దాడి
- ధర్మారంలో ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన ఇరువర్గాలు
- మంత్రి అనుచరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వారి కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన కొండా సురేఖ

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అభిమానులు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అభిమానులు, నాయకులు శనివారం దసరా పండుగకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వివాదానికి దారితీశాయి. కొండా అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో.. తమ నాయకుడు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫొటో లేదని రేవూరి వర్గం ప్రశ్నించగా గొడవ మొదలైంది. కొండా వర్గం దాడిలో రేవూరి అనుచరుడు పిట్టల అనిల్ గాయపడగా.. ఆదివారం ఎమ్మెల్యే ఆయనను పరామర్శించారు. ఈ ఘటనపై రేవూరి వర్గం గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొండా వర్గం సైతం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా వారిని అదుపులోకి తీసుకున్నారని ఆదివారం ధర్మారంలో కొండా అనుచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న మంత్రి సురేఖ సాయంత్రం గీసుకొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీపీ అంబర్ కిషోర్ ఝా చెప్పడంతో మంత్రి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుపతి, సీఐ మహేందర్ ఉన్నారు.

కాన్వాయ్ వీడి ఆటోలో వెళ్లి..

మంత్రి కొండా సురేఖ తన వర్గం వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కొడుతున్నారనే సమాచారంతో వరంగల్ నగరం నుంచి తన కాన్వాయ్‌లో ఆదివారం మధ్యాహ్నం బయలుదేరారు. ఆమె గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం సమీపానికి చేరుకోగానే పోలీసు అధికారులు తిరిగి వెళ్లిపోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే, మంత్రి వారి మాటలు వినకుండా కాన్వాయ్‌ని వీడి వరంగల్–నర్సంపేట రహదారి రైల్వే గేటు వద్దకు చేరుకున్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున ధర్నా చేస్తుండటంతో వెళ్లడానికి వీలు లేక కాలి నడకన ధర్మారం బస్టాండ్ వద్దకు చేరుకుని ఆటోలో కార్యకర్తలతో కలిసి పోలీస్ స్టేషన్‌కు తరలివెళ్లారు.

8 మందిపై కేసు నమోదు..

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు పిట్టల అనిల్‌పై శనివారం దాడి చేసిన అదేపార్టీకి చెందిన కొండా వర్గం వారిపై గీసుకొండ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. బాధితుడి సోదరుడు భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కొండా వర్గానికి చెందిన బండి రాజ్‌కుమార్, ముస్కు సురేశ్, కూస రాజేందర్, చెంచు రాజు, చౌడ శివప్రసాద్, ముస్కు రంజిత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేయగా మహేశ్వర్, వంశీ అనే ఇద్దరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని సీపీ వద్ద హాజరుపరచడానికి తీసుకెళ్లినట్లు సమాచారం.

వారితో ప్రాణహాని ఉంది..



గాయపడిన పిట్టల అనిల్

కొండా వర్గం దాడిలో గాయపడ్డ పిట్టల అనిల్ తన గోడును వినిపిస్తూ విడుదల చేసిన వీడియో వైరల్ అయింది. శనివారం రాత్రి 7 గంటల సమయంలో ధర్మారం గ్రామానికి రాగానే సుమారు 30 మంది తన కారుపై దాడి చేశారు. బీరు బాటిళ్లతో పిడిగుద్దులు గుద్దారని, ఇలా తనపై మంత్రి సురేఖ వర్గీయులు దాడి చేయడం మూడోసారి అని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ రోజు రాత్రి తన ఇంట్లోకి ప్రవేశించి సామగ్రి, కుర్చీలను ధ్వంసం చేశారని, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. వారితో తనకు ప్రాణ హాని ఉందని, తనను చంపాలని ప్రయత్నిస్తున్నారు. దయచేసి ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలిసేలా షేర్ చేయాలని అతడు ఆ వీడియోలో కోరారు.

ఆలయాల అభివృద్ధిపై దృష్టి

ఖిలావరంగల్/వరంగల్: నగరంలోని పురాతన ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగలీల మైదానంలో శనివారం రావణ వధ వేడుకలను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. వచ్చే ఏడాది రంగలీల మైదానాన్ని మరింతగా అభివృద్ధి చేసి మైసూర్‌ను తలపించేలా వేడుకలు నిర్వహిస్తామన్నారు. రంగలీల మైదానం ఎదురుగా ఉన్న భూమి దసరా ఉత్సవాల కోసం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఇతరులు కొనుగోలు చేసినా నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు. అనంతరం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. టెంపుల్ టూరిజంలో భాగంగా కాకతీయుల నాటి ఆలయాలను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చేలా కృషి చేయాలని మంత్రి కొండా సురేఖను కోరారు.

వైద్య వృత్తిలో కొనసాగడం గర్వంగా ఉంది

ఎంజీఎం: ప్రాణాలు కాపాడే వైద్య వృత్తిలో కొనసాగడం గర్వంగా ఉందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్ పేర్కొన్నారు. కరోనాతో మృతి చెందిన 11 మంది వైద్యులకు గుర్తుగా ఏర్పాటు స్మారక చిహ్నాన్ని శనివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎంతో మంది వైద్యులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి కరోనా రోగులకు చికిత్స అందించారని, అమ్మ జన్మనిస్తే.. వైద్యుడు పునర్జన్మను ప్రసాదిస్తాడని అన్నారు. అనంతరం వరంగల్ విభాగ కమిటీ నూతన సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా వేడుకలు



రంగలీల మైదానంలో దహనమవుతున్న రావణ ప్రతిమ

జిల్లాలో దసరా వేడుకలను ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉత్సవాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా శమీ పూజ, వాహన పూజ, పోలీస్ స్టేషన్లలో ఆయుధ పూజలు చేశారు. వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పాల్గొన్నారు. అదేవిధంగా నర్సంపేట అంగడి మైదానంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో రావణ వధ నిర్వహించారు. వర్ధన్నపేట సీతారామచంద్రస్వామి దేవాలయంలో అర్చకులు కలకోట గోపాలాచార్యులు, రామాచార్యులు, శ్రావణ్ కుమారాచార్యులు, మునిసిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

– నర్సంపేట/వర్ధన్నపేట/ఖిలా వరంగల్



నర్సంపేట : అంగడిమైదానంలో రావణవధ



నర్సంపేట : వేంకటేశ్వరస్వామి ఆలయంలో శమీ పూజ చేస్తున్న అర్చకులు



వర్ధన్నపేటలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ

రుద్రేశ్వరీదేవికి శ్రీచక్రస్నానం



అమ్మవారికి శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యాన శ్రీరుద్రేశ్వరీదేవికి శ్రీచక్రస్నానం నిర్వహించారు. అంతకు ముందు మూలమహాగణపతికి, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి అభిషేక పూజలు చేశారు. విజయదశమి పూజల తర్వాత అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పల్లకీలో ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటిలో ఉత్సవమూర్తికి శ్రీచక్రస్నానం నిర్వహించారు. ప్రదోషకాల పూజ అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించి పద్మాక్షిగుండంలో నిమజ్జనం చేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ సారయ్య, సిరిసిల్ల రాజయ్య, గట్టు మహేశ్‌బాబు, పల్లం రమేశ్, కిషన్‌లాల్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో తాళి చూపిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్/హన్మకొండ అర్బన్: శ్రీభద్రకాళీ దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాల ముగింపులో భాగంగా భద్రకాళీభద్రేశ్వరుల కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు నిత్యాహ్నికం, కుంభాభిషేకం, చతుస్థానార్చనాదుల అనంతరం రాత్రి 8 గంటలకు పూలతో అలంకరించిన వేదికపై ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీభద్రేశ్వరస్వామికి ద్వితీయ స్వర్ణ యజ్ఞోపవీతాన్ని సమర్పించారు. వరపూజ, మధుపర్కవిధి తదితర వివాహతంతు పూర్తి చేశారు. అనంతరం పుష్పయాగం నిర్వహించారు. ఇదిలా ఉండగా.. హనుమద్గిరి పద్మాక్షీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం చెరువులో అమ్మవారికి తెప్పోత్సవం కనులపండువగా నిర్వహించారు. వేద పండితులు షణ్ముఖ శర్మ పాల్గొన్నారు.

అమ్మవారికి తెప్పోత్సవం..

మహానవమి విజయదశమిని పురస్కరించుకుని శనివారం భద్రకాళి అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శోభాయమానంగా అలంకరించిన హంసవాహనంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి భద్రకాళి తటాకంలో విహారింజేశారు. మంత్రి కొండా సురేఖ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వద్దిరాజు రవిచంద్ర, దేవా దాయశాఖ సహాయ కమిషనర్ సునీత, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ దర్శించుకున్నారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు.

పూజకు వాహనాల బారులు



కోటగండి వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

గీసుకొండ: దసరా పండుగను పురస్కరించుకుని కోటగండి కోట మైసమ్మ ఆలయంలో పూజల కోసం శని, ఆదివారాల్లో వాహనాలు బారులు తీరాయి. వరంగల్–నర్సంపేట రహదారికి ఇరువైపులా కిలోమీటరు మేర వాహనాలను వాటి యజమానులు పూజల కోసం నిలిపి ఉంచారు. దీంతో గంటల పాటు భక్తులు వేచి చూశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడ్డారు.

పైసలిస్తేనే ఫైలు కదిలేది!

- బల్దియాలో ప్రతి పనికో రేటు !
- లేదంటే కాళ్లరిగేలా తిరగాల్సిందే..
- సిటిజన్ చార్టర్‌కు మంగళం
- పట్టించుకోని పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారి

'కొత్త ఇంటి నంబరు కావాలా? ఆస్తి పన్ను హక్కు బదలాయింపు చేసుకోవాలా.. దరఖాస్తు చేసి పక్షం రోజుల్లో తీసుకెళ్లండి. కొత్త భవన నిర్మాణం కోసం టీఎస్ బీపాస్‌లో డాక్యుమెంట్లు దాఖలు చేసి 21 రోజుల్లో ప్లాన్ తీసుకోండి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మూడు రోజుల్లో జారీ చేస్తాం' ఇవి వరంగల్ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయం, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో కనిపించే బోర్డులు. అయితే ఇవన్నీ బోర్డులకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పైసలిస్తేనే పని జరిగే పరిస్థితి నెలకొంది. – వరంగల్ అర్బన్

గ్రేటర్ వరంగల్ ఆఫీస్‌లు అవినీతికి నిలయాలుగా మారాయి. ఇక్కడ ఏ ఫైలు.. ఏ పనికైనా పైసలు చెల్లించాల్సిందే. కాసులివ్వడమో.. కాళ్లరిగేలా తిరగడమో ఏదో ఒకటి చేస్తేనే పనవుతుంది. భవన నిర్మాణ అనుమతులు, కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, ఆస్తుల పేరు మార్పిడి, విభజన, కొత్త నల్లా కనెక్షన్లు, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, అభివృద్ధి పనులు ఇలా ఏదైనా సరే.. ప్రతీ పనికి ఒక రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు అధికారులు. కొన్ని పనులకైతే దళారులు ముందుండి వ్యవహారమంతా నడిపిస్తున్నారు. కాగా.. అధికంగా మామూళ్లు వచ్చే విభాగాల్లోని పోస్టుల కోసం సిబ్బంది రూ.లక్షల్లో ముట్టజెప్పి.. పోస్టింగ్ దక్కించుకుంటున్నారు. ఆతర్వాత అందినకాడికి దండుకుంటున్నారు.

కొర్రీలు..

మహానగర విస్తీర్ణం పెరిగింది. జనాభా 10.80 లక్షలకు పైచిలుకు చేరింది. నగర పరిపాలన సౌలభ్యం కోసం సుమారు పదేళ్ల క్రితం కాశిబుగ్గ, కాజీపేట రెండు ప్రాంతాల్లోని సర్కిల్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. 80 శాతం సేవలు ఆయా సర్కిల్ కార్యాలయాల్లో లభిస్తున్నాయి. కాగా వివిధ పనుల నిమిత్తం ఈ కార్యాలయాలకు వచ్చే వారికి నిబంధనల పేరిట కొర్రీలు పెట్టి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పారదర్శకత కోసం ఈ–ఆఫీస్ విధానం అమలవుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు.

పంపకాలు..

దరఖాస్తుదారుల నుంచి లంచం తీసుకునేది ఒక్కరే కానీ.. వివిధ హోదాల్లో కింది స్థాయి నుంచి ఫైనల్ సంతకం చేసే ఉన్నతాధికారుల వరకు వాటాలుగా పంపకాలు కొనసాగుతున్నాయి. పైసలు ముట్టజెప్పకపోతే పౌరసేవల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారు. సిటిజన్ చార్టర్ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. కొత్త ఇంటి నంబరు ఇవ్వడం.ఆస్తుల పేరు మార్పిడి,విభజన,అధునాతన భవనాన్ని ఆర్డినరీగా చూపి పన్ను విధించడం, కమర్షియల్ అయినప్పటికీ..రెసిడెన్షియల్‌గా చూపిపన్ను వేయడం,అసెస్‌మెంట్ చేయకుండా,రివిజన్ పిటిషన్ పేరుతో పన్ను తగ్గించడం..ఇలా డబ్బులిస్తే ఏదైనా సాధ్యమేనని కొందరు నిరూపిస్తున్నారు.బల్దియాకు సమకూరాల్సిన రూ.కోట్ల రూపాయల ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు.ఆస్తుల పేరు మార్పిడి,విభజన పేరుతో ప్రతీ ఫైల్‌కు రూ.5వేల నుంచి 30వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు.

అవినీతి ప్రణాళిక..

ప్రణాళిక విభాగంలో ఆధ్వర్యంలో భవన నిర్మాణ అనుమతులకు టీఎస్–బీపాస్ ద్వారా నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్నప్పటికీ లైసెన్స్ సర్వేయర్ల ద్వారా రూ.10వేల నుంచి రూ.30వేలు పుచ్చుకుంటూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. డబ్బులివ్వకపోతే నిబంధనలపేరిట దరఖాస్తుల్ని తిరస్కరిస్తున్నారు. అనధికారిక నిర్మాణాలకు రూ.5 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూళ్లకు పాల్పడుతూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రచారానికే పరిమితమైన బోర్డులు

వసూళ్లు ఇలా..

- ఆర్డీఓ ప్రాసెస్ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు రూ.వెయ్యి నుంచి 3 వేల వరకు పుచ్చుకుంటున్నారు. ట్రేడ్ లైసెన్స్‌కు రూ.3 వేల నుంచి రూ.5వేలకు వరకు తీసుకుంటున్నారు. కొత్త నల్లా కనెక్షన్‌కు అన్ని చెల్లింపులు చేసినా రూ.3 వేలు దండుకుంటున్నారు. అభివృద్ధి పనుల్లో వివిధ రకాలుగా 20 శాతం మేరకు ముడుపులు ముట్టజెప్పాల్సిందే.
- ఇంజినీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్, డీఈ, ఈఈ, ఎస్ఈలతో పాటు ఆఫీస్ సిబ్బంది ఉంటారు. కొత్త పనులకు టెండర్ల ఒప్పందం, పూర్తయినా పనుల బిల్లుల సిఫార్సు చేయాలన్నా.. ప్రతీ పని అంచనా విలువలో 5 నుంచి 10 శాతం కమీషన్లు బాహాటంగా కొనసాగుతున్నాయి.

జరిమానాలేవి?

సిటిజన్ చార్టర్‌లో నిర్దేశించిన గడువులోగా సేవలు అందించని ఉద్యోగులు, అధికారులపై సేవలు, ఫైళ్ల జాప్యం ఆధారంగా జరిమానాలు విధించాలి. జీడబ్ల్యూఎంసీలో ఇవేవీ అమలు కావడం లేదు. పాలకవర్గం పెద్దలు, అధికారులకు పట్టడం లేదు.

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
కిడ్నీ వ్యాధులు: [illegible]	[illegible]	15-10-2024 3వ మంగళవారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible]	[illegible]	
కిడ్నీ వ్యాధులు: [illegible]	[illegible]	16-10-2024 3వ బుధవారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible]	[illegible]	
[illegible]	[illegible]	
[illegible]	[illegible]	17-10-2024 3వ గురువారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు
[illegible]	[illegible]	
[illegible]	[illegible]	18-10-2024 3వ శుక్రవారం ఉదయం 10 గం. నుండి మధ్యాహ్నం 3 గం. వరకు

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

'కాసం' బంపర్ డ్రా విజేత లక్ష్మీనారాయణ



కాజీపేట అర్బన్ : కాసం ఫ్యాషన్స్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రతీ ఊరికి ఒక బైక్ చొప్పున.. హనుమకొండలో ఆదివారం బంపర్ డ్రా తీశారు. ఇందులో మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణను అదృష్టం వరించింది. వ్యాపారి ప్రవీణ్ డ్రా తీయగా సీపే 32009911-10-24-2 నంబర్‌కు బైక్ వచ్చినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

అంతర్జాతీయ నృత్యోత్సవాలకు రవికి ఆహ్వానం



ఒగ్గు రవి

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన ఉస్తాద్ ఒగ్గు రవికి న్యూఢిల్లీలో భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 21 వరకు జరిగే ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియన్ డ్యాన్స్ అంతర్జాతీయ నృత్యోత్సవాలకు ప్యానల్ ప్రెసెంటర్‌గా పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. వారం రోజులు జరిగే కార్యక్రమాల్లో పాల్గొని సంగీత నాటక అకాడమీకి నిర్మాణాత్మక నివేదికను అందజేయనున్నారు. కాగా, జానపద కళ ఒగ్గు కళాకారుడికి ఇంత గొప్ప అవకాశం లభించడం హర్షణీయమని పలువురు ఒగ్గు కళాకారులు రవిని అభినందించారు.

పండుగ పూట ఘర్షణ..

- ఉగ్గంపల్లిలో పారలు, కత్తులతో దాడులు
- ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న రమేశ్

చిన్నగూడూరు: దసరా పండుగ పూట ఘర్షణ జరిగింది. ఇందులో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో జరిగింది. బాధితుడు బీసు ప్రశాంత్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాషబోయిన మహేశ్ దసరా రోజు తన అనుచరులతో కలిసి ప్రశాంత్ కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. ప్రశాంత్ తండ్రి రమేశ్‌ను పోలీస్ వాహనం ముందే గ్రామస్తుడు దాసరి యాకన్న కత్తితో పొడిచి గాయపరిచాడు. అలాగే , ప్రశాంత్ మామ దుస్సు వెంకన్నను చితకబాదారు. అదే గ్రామానికి చెందిన దాసరి రాజు, దాసరి సురేశ్, దాసరి వెంకన్న, దాసరి ప్రత్యూష, దాసరి సునీత, గంగాధరి సాయిలు పారలు, గొడ్డళ్లతో బీభత్సం సృష్టించి చితకబాదారు. స్థానికుల సాయంతో అంబులెన్స్‌లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి వెళ్లగా అక్కడ కూడా వదలకుండా కాంగ్రెస్ లీడర్ తన అనుచరులతో దాడి చేసి చంపడానికి యత్నించారు. పోలీసులు రావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈఘటనపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదు. వారితో ప్రాణభయం ఉందని, ఈ ఘటనపై విచారించి తమకు న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదులో కోరాడు.



విద్యార్థి జీవితానికి విజ్ఞానోదయం

నవోదయలో ప్రవేశాలకు వేళాయె..

- 2025-26 విద్యా సంవత్సరానికి మిగులు సీట్లకు ప్రకటన
- 9,11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



ఖిలా వరంగల్: జవహర్ నవోదయ విద్యాలయం .. విద్యార్థి జీవితానికి విజ్ఞానోదయం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తూ, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. సామాన్య, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు సకల వసతులతో కూడిన విద్యనందిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత శిఖరాలకు చేరారు. 1992లో ఖిలా వరంగల్ మండలం మామునూరులో నెలకొల్పిన జవహర్ నవోదయ విద్యాలయం వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారు ఎంచుకున్న రంగల్లో స్థిర పడేందుకు దోహదపడింది.

విద్యాలయంలో వసతులు..

మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా నైపుణ్యాలు, దేశ భక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వంటి శిక్షణలు ఇస్తున్నారు. ప్రతిష్ఠాత్మక ఐఐటీ, జేఈఈ, నీట్ , యూపీఎస్సీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందేలా సన్నద్ధం చేస్తున్నారు.

9వ తరగతిలో ఎంపిక పరీక్ష ఇలా..

ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 9వ తరగతిలో మొత్తం 11 ఖాళీలు ఉన్నాయి. వాటి కోసం ప్రవేశ పరీక్షలో ప్రధానంగా హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లోని ప్రశ్నలు ఉంటాయి. ఓఎంఆర్ ఆధారిత అబ్జెక్టివ్ రకం ద్విభాషా ప్రశ్న పత్రం (హిందీ, ఆంగ్లం)లో ఉంటుంది.

ఇంటర్ 11వ తరగతిలో ప్రవేశానికి..

పదోతరగతి పూర్తి చేసి ఇంటర్ 11వ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు మానసిక సామర్థ్యం, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సైన్స్ పై ప్రావీణ్యం ఉండాలి. ఓఎంఆర్ ఆధారిత అబ్జెక్టివ్ రకం పేపర్ ఉంటుంది. ద్విభాషా ప్రశ్నపత్రం (హిందీ, ఆంగ్లం) ఉంటుంది. ప్రధానంగా జిల్లాకు చెందిన వారై ఉంటే మెరిట్‌లో పరిగణించబడతారు.

ప్రణాళిక ప్రకారం చదివిస్తాం..



వచ్చే ఏడాది కోసం 9,11వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ కోసం ప్రకటన విడుదల చేశాం. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశాలు మెరిట్ ప్రకారమే ఉంటాయి. ప్రవేశాల కోసం దళారులను ఆశ్రయించొద్దు. ఎవరైనా సీటు ఇప్పిస్తామని మభ్య పెడితే ఫిర్యాదు చేయాలి. ఇక్కడ ఉత్తమ బోధనతోపాటు ప్రణాళిక ప్రకారం చదివిస్తాం. రోజూ ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది.

-పూర్ణిమ, ప్రిన్సిపాల్
నవోదయ విద్యాలయం, మామునూరు

మిగులు సీట్లకు దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 9, 11వ తరగతుల్లో ఏర్పడిన మిగులు సీట్ల భర్తీకి ప్రకటన వెలువడింది. రాత పరీక్ష ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నారు. 9,11వ తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 9వ తరగతిలో చేరేందుకు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 01, 05, 2010 నుంచి 31, 07, 2012 మధ్య జన్మించి ఉండాలి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు ప్రస్తుతం పదో తరగతి చదువుతూ 01, 06, 2008 నుంచి 31, 07, 2010 మధ్య జన్మించిన వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు చెందిన వారితోపాటు అన్ని కేటగిరీల విద్యార్థులకు ఈ నిబంధన వర్తిస్తుంది. విద్యార్థులు అక్టోబర్ 30లోగా నవోదయ విద్యాలయ వెబ్ సైట్ www.navodaya.gov.in ద్వారా దరఖాస్తు పూర్తి చేయాలి. రాత పరీక్ష 2025 ఫిబ్రవరి 08న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పూర్ణిమ తెలిపారు.

ప్రైవేట్ కళాశాలలు బంద్ చేస్తే చర్యలు

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు నిరవధికంగా బంద్‌చేస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కళాశాలలకు విద్యార్థులకు ట్యూషన్ ఫీజుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, దీంతో తాము కళాశాలలను నడిపే పరిస్థితి లేదని, తాము దసరాసెలవుల తరువాత మళ్లీ కళాశాలలను రీఓపెన్ చేయబోమని ఇటీవలే కేయూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ బాధ్యులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందించిన విషయం విధితమే. దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో యథావిధిగా ప్రైవేట్ కళాశాలలు ప్రారంభించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. కళాశాలలు నిరవధికంగా బంద్ చేస్తే డిగ్రీ కోర్సుల ఒకటో, మూడో, ఐదో సెమిస్టర్ తరగతులు, పీజీ కోర్సుల ఒకటో, మూడో సెమిస్టర్ల తరగతులపై, అలాగే పరీక్షలపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 14వతేదీ నుంచి నిరవధిక బంద్‌ను విరమించుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

దసరా రోజు జాతీయజెండా ఆవిష్కరణ..



జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ మంగమ్మ, స్థానికులు

గార్ల: దసరా పండుగ రోజు శనివారం గార్లలోని మసీదు సెంటర్‌లో ఎంపీడీఓ మంగమ్మ జాతీయ జెండా ఆవిష్కరించారు. దసరా రోజు నిజాం నవాబు నెలవంక కలిగి ఉన్న నీలిరంగు జెండా ఎగురవేసేవాడు. ఈ క్రమంలో నిజాంల కాలం అంతరించినప్పటి నుంచి ఏటా దసరా పండుగ రోజున ఇక్కడి సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించడం 73 ఏళ్లగా కొనసాగుతోంది. 1952లో గార్ల టౌన్ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ నేత మాటేటి కిషన్‌రావు ఎన్నికయ్యారు. అప్పటి నుంచి దసరా రోజు మసీదు సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించగా ఆనవాయితీ కొనసాగిస్తున్నారు.

లింగాలఘణపురం మండలంలో..



వనపర్తిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల, వనపర్తి గ్రామాల్లో దసరా వేడుకల సందర్భంగా శనివారం జాతీయ జెండాలను ఆవిష్కరించారు. నెల్లుట్లలో చిట్ల ఉపేందర్‌రెడ్డి గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. వనపర్తిలో గ్రామస్తులంతా కలిసి పాల కేంద్రం ఎదుట జాతీయ జెండాను ఎగురవేసి దసరా ఉత్సవాలను నిర్వహించారు.

భర్తను కడతేర్చిన భార్య

- తల్లి, సోదరుడితో కలిసి దారుణ హత్య
- ఈ ఘటనలో ముగ్గురి అరెస్ట్

కేసముద్రం: భర్తను.. తల్లి, తమ్ముడితో కలిసి భార్య కడతేర్చింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండలో జరిగింది. ఇన్‌చార్జ్ రూరల్ సీఐ బాబూరావు, ఎస్సై మురళీధర్ రాజు కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాకు చెందిన లక్క ప్రశాంత్(31), అమీనా దంపతులు ఇద్దరు కూతుళ్లతో కలిసి బతుకుదెరువు కోసం 4నెలల క్రితం పెనుగొండకు వచ్చి మేస్త్రీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు.అమీనా తల్లి కడియాల నూర్జహాన్, తమ్ముడు అమీర్ బాష కూడా పని నిమిత్తం ఇక్కడికి వచ్చి, వారుండే వీధిలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో అమీనాను భర్త తరచూ అనుమానిస్తూ వేధిస్తున్నాడు. రోజూ మద్యం సేవించి ఇద్దరు పిల్లలు నాకు పుట్టలేదంటూ, ఆమెను కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో అమీనా తన తల్లి, తమ్ముడికి భర్త వేధింపులు చెప్పుకుని విలపించింది. ఎలాగైనా భర్తను చంపాలని, లేకుంటే తనను,ఇద్దరు పిల్లలతోపాటు, మిమ్మల్ని కూడా చంపుతాడని చెప్పింది. చివరకు భర్తను చంపేందుకు అమ్మ, తమ్ముడిని ఒప్పించింది. ఈనెల 10వ తేదీన అర్ధరాత్రి ముగ్గురు కలిసి నిద్రపోతున్న ప్రశాంత్ మెడకు తాడుబిగించి హత్య చేశారు. అమీనా వేడి చేసిన గరిటెతో తన భర్త మర్మంగాలను కాల్చింది. ఎవరికి అనుమానం కలగకుండా తెలిసిన ఆటోను పిలిపించుకుని మానుకోట ఆస్పత్రికి వెళ్లాలని తీసుకెళ్లారు. కాగా, జిల్లా కేంద్రానికి వెళ్లగా అక్కడి నుంచి రైల్వేగేటుకు వైపునకు తీసుకెళ్లాలని చెప్పడంతో ఆటోడ్రైవర్‌కు అనుమానం వచ్చి నిలదీశాడు. అనంతరం ఈ విషయం పోలీసులకు తెలిపాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, శనివారం హత్యకు పాల్పడిన అమీనాతోపాటు, తన తల్లి నూర్జహాన్, తమ్ముడు అమీర్‌బాషను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ బాబురావు తెలిపారు. కాగా, ఆటోడ్రైవర్ రాము బాధ్యతాయుతంగా వ్యవహరించి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించినందుకు అతడిని పోలీసులు అభినందించారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



రాంరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్రం మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే పల్లా

బచ్చన్నపేట : వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొడవటూర్‌లో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి ప్రథమ వర్ధంతికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి, మాజీ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ రెడ్డి, మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా మృతి ప్రజలకు తీరని లోటు

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వర్

విద్యారణ్యపురి: పీడిత ప్రజల పక్షపాతి, ప్రజాఉద్యమకారుడు, ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ ఎస్. సాయిబాబా మృతి పీడిత ప్రజలకు తీరని లోటని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడిత ప్రజల పక్షపాతి ఉన్నందుకే ఆయనను అక్రమ కేసులో అరెస్టు చేశారని, శరీరం సహకరించకున్నా మొక్కవోని ధైర్యంతో జైలు జీవితం గడిపి నిర్దోషిగా విడుదలయ్యారన్నారు. జైలు జీవితం ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అనారోగ్యంతో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. సాయిబాబా మృతిపై టీపీటీఎఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తుందన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ సెక్రటరీ పూజారి మనోజ్, ఉపాధ్యక్షుడు జె. స్వామి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యు. అశోక్, బాధ్యులు బెల్లంకొండ పూర్ణచందర్, ముజాహిద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దసరా రోజు సద్దుల బతుకమ్మ..



బొగత వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు



బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

వాజేడు: మండలంలోని గుమ్మడి దొడ్డి, వాజేడు డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద దసరా రోజున సద్దుల బతుకమ్మ నిర్వహించారు. గుమ్మడి దొడ్డి గ్రామంలో ఏటా దసరా రోజున సద్దులు నిర్వహించడం కొంత కాలంగా వస్తోంది. కొన్ని సంవత్సరాల క్రితం సద్దుల బతుకమ్మ రోజున ఇర్ప మునెయ్య అనే వ్యక్తి మృతి చెందడంతో ఆరోజు మంచిది కాదని, దసరా రోజుకు పొడిగిస్తూ 11 రోజుల పాటు ఇక్కడ బతుకమ్మ ఆడుతూ వస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం రాత్రి సద్దుల బతుకమ్మ ఆడి ఆదివారం ఉదయం బొగత వాగులో నిమజ్జనం చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ ఎత్తున బతుకమ్మ ఆడి సమీపంలోని గోదావరిలో నిమజ్జనం చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చలివాగులో ఇద్దరు మృతి
- రెండు కుటుంబాల్లో విషాదం



రాములు(ఫైల్) హరీశ్(ఫైల్)



రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లత

టేకుమట్ల: దసరా పండుగ సంబురం ముగిసిన అనంతరం సరదాగా గడిపేందుకు చలివాగు వద్దకు వచ్చిన వారిలో ఈత కొట్టడానికి వెళ్లిన ఇద్దరు విగతజీవులుగా మారిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో ఆదివారం చోటుచేసుకుంది. మృతులు టేకుమట్ల మండలం వెల్లంపల్లికి చెందిన సాల్లేటి రాములు(48), గీస హరీశ్(28) కుటుంబ సభ్యులు, మరో రెండు కుటుంబాలు టేకుమట్ల శివారు చలివాగు వద్ద సరదాగా గడిపేందుకు ఆదివారం వచ్చారు. రాములు, హరీశ్ వాగులో ఈత కొడుతూ సరదాగా గడుపుతున్న క్రమంలో హరీష్ వాగులో ఏర్పడిన గుంతలో పడిపోగా.. అతడిని కాపాడబోయి రాములు సైతం అందులోనే పడి నీటిలో మునిగిపోయాడు. ఆ ఇద్దరు కనిపించకపోవడంతో దూరం నుంచి గమనిస్తున్న కుటుంబ సభ్యులు ఒక్కసారిగా కేకలు వేస్తూ.. సమీపంలో ఉన్న మత్స్యకారుల సహాయం కోరారు. వారితోపాటు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి వాగు గుంతలో వెతికి ఇద్దరిని వెలికి తీశారు. అయితే అప్పటికే వారు మృతి చెంది ఉండడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. రాములు వెల్లంపల్లి గ్రామ పంచాయతీ సిబ్బందిగా పని చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన హరీశ్ వరంగల్‌లోని ఓ బేకరీ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. దసరా పండగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చి మృత్యుఒడికి చేరడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. కాగా రాములు భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237317]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1237318]

గొర్రె / గొర్రె పోతులు అమ్మకం

■ దేశవాళి గొర్రెపోతులు & గొర్రెలు కాపరిచే పెంచబడినవి అమ్మకమునకు కలవు. గొర్రె పోతు లైవ్ 1కిజి. 460/-, గొర్రె (ఆడది) లైవ్ 1కిజి 400/- బ్లాపూర్, దామెర మం॥ సంప్ర. 9030241156, 9121604262 [M-12175]

WANTED

■ వరంగల్ ట్రై సిటీలో రియల్ ఎస్టేట్‌లో GM/MM, M/F కావలెను. రిటైర్డ్ ఎంప్లాయిస్, రియల్ ఎస్టేట్ అనుభవం ఉన్నవారు, Ex సర్వీస్‌మెన్స్‌కి ప్రాధాన్యత. 8555936358, 8106342859. [W-1239921]

■ మా అపార్ట్‌మెంట్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, స్వీపర్స్, స్త్రీ, పురుషులు కావలెను. సంప్ర॥ 9491710857, 7382106287. [W-1237329]

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు Telecallers, Receptionist, Management, Marketing, Supervisor, Office Boy, స్త్రీ, పురుషులు కావలెను. సంప్ర॥ 7382323126, 9491706517. [W-1237330]

■ ప్రముఖ ISO సర్టిఫికేట్ గల కంపెనీలో పని చేయుటకు మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీ/పు) కావలెను. ప్రతి నెల లక్ష ఇన్‌కం. VRS రిటైర్మెంట్ వారికి కూడా ప్రాధాన్యత. సంప్ర॥ 9866137009 [W-1237320]

■ Wanted Lab Technician & M.Pharm / Pharm.D / B.Pharm. D / B. Pharm Graduate Female for Clinic in Hanamkonda. Ph: 9494970980. [W-1239918]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663. [H-796283]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రహదారులు రక్తసిక్తం..

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి దుర్మరణం
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు

రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం రాత్రి, శనివారం, ఆదివారాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.



రవీందర్‌రెడ్డి, దావీస్ మృతదేహాలు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని జనగామ- సూర్యాపేట రోడ్డు వడిచర్ల, జనగామ- క్లాంం రోడ్డుల్లో ఆదివారం వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. వడిచర్ల వద్ద జరిగిన ప్రమాదంలో కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన రవీందర్‌రెడ్డి (32), క్లాంం వద్ద జరిగిన ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా మండలం మూటకొండూరు మండలం తేరాల గ్రామానికి చెందిన ఉర దావీస్ (28) మృతి చెందారు. రవీందర్‌రెడ్డి నల్లగొండ నుంచి కారులో సుల్తానాబాద్‌కు వెళ్తుండగా వడిచర్ల వద్ద రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలై చెట్ల పొదల్లో పడగా స్థానికులు గుర్తించారు. 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి వద్ద రూ.57,120 నగదు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా దావీస్ ద్విచక్ర వాహనంపై జనగామ నుంచి స్వగ్రామం తేరాలకు వెళ్తుండగా క్లాంం క్రాస్‌లో అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపారు.

హనుమకొండలో మరొకరు..



మజర్(ఫైల్)

పరకాల: పరకాల పట్టణానికి చెందిన ఎం.డీ మజర్ (39)శనివారం రాత్రి హనుమకొండలోని వడ్డేపల్లి చర్చి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో పరకాలలో విషాదం చోటుచేసుకుంది. కొంత కాలంగా హనుమకొండలో నివాసం ఉంటున్న మజర్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. సమాచారం తెలియగానే మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు విషాదంలో మునిగారు.

టెంకమెత్తల వద్ద యువకుడు..



వెంకటేశ్(ఫైల్)

బయ్యారం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాలాజీపేటకు చెందిన పేర్ని వెంకటేశ్(34) గట్టుముసలమ్మ ఆలయం వద్ద అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన విందుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో బయ్యారం నుంచి ఇర్సులాపురానికి బైక్ పై వెళ్తున్న టి.లక్ష్మయ్య మండలంలోని రామచంద్రాపురం రహదారిపై టెంకమెత్తల వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు వరంగల్ ఎంజీఎం రెఫర్ చేశారు.

మామునూరులో గుర్తు తెలియని మహిళ..

మామునూరు : వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని ఓ మహిళ దుర్మరణం చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు నుంచి వరంగల్ వైపునకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో సదరు మహిళ మృతదేహం మాంసపు ముద్దగా మారింది. ఈవిషయం తెలిసిన మామునూరు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మాంసపు ముద్దలను గోనె సంచిలో వేసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. మహిళను ఢీకొని పరారైన వాహన కోసం సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి



రమేశ్ (ఫైల్)

నెక్కొండ: చేపల వేటకు వెళ్లి ఓ జాలరి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని రెడ్లవాడలో చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీరటి రమేశ్ (39) తెల్లవారుజామున సహ జాలర్లతో కలిసి గ్రామ శివారులోని ఊరకుంట్ల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో చేపల వల చుట్టుకోవడంతో నీట మునిగాడు. గమనించిన సహ జాలర్లు రమేశ్‌ను ఒడ్డుకు తీసుకురాగా అప్పటికే మృతి చెందాడన్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విషజ్వరంతో వృద్ధురాలు..

ములుగు రూరల్: విష జ్వరంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని జంగాలపల్లి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లికాంబ(70) మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. ములుగు ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందినా తగ్గలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం వైద్యులు వరంగల్ ఎంజీఎం పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది.

రైలు ఢీకొని మరో వృద్ధురాలి..

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని 26 వార్డుకు చెందిన డొలాగర్ జ్ఞానేశ్వరి (65) రైలు ఢీకొని మృతి చెందిందని జీఆర్పీ ఎస్సై సురేశ్ శనివారం తెలిపారు. జ్ఞానేశ్వరి పూజ కోసం ఆకులు కోసుకుని వస్తూ సిగ్నల్ కాలనీ ప్రాంతంలో పట్టాలు దాదుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిందని జీఆర్పీ ఎస్సై సురేశ్ పేర్కొన్నారు.

పాముకాటుతో వ్యక్తి ..

ఖానాపురం: పాముకాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఖానాపురం గ్రామానికి చెందిన వేములపల్లి హన్మంతారావు(59) ఇంటి వద్ద ఉండగా పాము కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వాటర్‌మన్ ఆత్మహత్య



గువ్వల రాజు(ఫైల్)

ఐనవోలు: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ముల్కలగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. గ్రామంలో వాటర్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న గువ్వల రాజు (28) దసరా సందర్భంగా శనివారం మద్యం సేవించాడు. మత్తులో ఆదివారం తెల్లవారుజామున పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాగా, గువ్వల రాజు ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.